క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొరిటిపాడు: ఆటోనగర్ సబ్ స్టేషన్ పరిధిలోని లారీ స్టాండ్ ఫీడర్‌లో మరమ్మతుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ ఎం.రవికుమార్, డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.హెచ్.ఖాన్ గురువారం తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు లారీ స్టాండ్, ఎస్‌వీఆర్ కంపెనీ తదితర ప్రాంతాల్లో సరఫరా నిలిపివేస్తున్నట్లు వారు వెల్లడించారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

సందడిగా ముందస్తు రక్షా బంధన్ వేడుకలు



గుంటూరు ఎడ్యుకేషన్: లక్ష్మీపురంలోని పాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్‌ఈ పాఠశాలలో గురువారం ముందస్తు రక్షా బంధన్ (రాఖీ) వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు తమ తోటి విద్యార్థులకు రాఖీలు కట్టారు. పాఠశాల కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ మాట్లాడుతూ సోదరీ, సోదరుల మధ్య ప్రేమ, నమ్మకానికి ప్రతీకగా నిలిచే పండుగే రక్షా బంధన్ అని అన్నారు. భావి తరతరాలకు రాఖీ విశిష్టత తెలియాల్సిన అవసరముందని, తద్వారా వారి మధ్య అనుబంధం, ఆత్మీయతలు పెరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల పాలక వర్గ సభ్యుడు గింజుపల్లి వరప్రసాదరావు, అకడమిక్ డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపాల్ దోసకాయల దుర్గాశ్యామ్, ప్రైమరీ కోఆర్డినేటర్ దిల్ జహాన్, ప్రీ-ప్రైమరీ కోఆర్డినేటర్ టి. శ్రీదేవి, ఇన్‌చార్జ్ కె. హరిప్రియ తదితరులు పాల్గొన్నారు.

పట్టాభిపురం ఎస్‌ఐగా నాగేంద్ర బాధ్యతల స్వీకరణ



లక్ష్మీపురం: పట్టాభిపురం ఎస్‌ఐగా ఐ.నాగేంద్ర గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు పని చేసిన ఎస్‌ఐ నరహరిని అధికారులు ప్రత్తిపాడు స్టేషన్‌కు పంపారు. ఆయన స్థానంలో ప్రత్తిపాడు ఎస్‌ఐగా పని చేస్తున్న నాగేంద్రను పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. గురువారం సాయంత్రం నాగేంద్ర స్టేషన్ సీఐ గంగా వెంకటేశ్వర్లును కలిసి బాధ్యతలు స్వీకరించారు. 2018లో ఎస్‌ఐగా చేరిన నాగేంద్ర లాలాపేట, పెదకాకాని, ప్రత్తిపాడు స్టేషన్‌లలో పని చేశారు.

17, 18 తేదీల్లో సీపీఐ జిల్లా మహాసభలు



లక్ష్మీపురం: నగరంలో ఈ నెల 17, 18 తేదీల్లో నిర్వహించనున్న సీపీఐ జిల్లా 26వ మహాసభలను జయప్రదం చేయాలని నగర కార్యదర్శి ఆకీటీ అరుణ్‌కుమార్ పిలుపునిచ్చారు. కొత్తపేట జిల్లా కార్యాలయంలో గురువారం మహాసభల పోస్టర్‌లను గుంటూరు నగర సమితి ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాసభలకు ముఖ్య అతిథులుగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ, సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు పాల్గొంటున్నారని తెలిపారు. ఈనెల17వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు బీఆర్ స్టేడియం నుంచి గ్రామిక ప్రజా ప్రదర్శన, అనంతరం విజయ టాకీస్ ప్రాంగణంలో బహిరంగ సభ ఉంటుందని తెలిపారు. ప్రజలు పెద్ద ఎత్తున ప్రదర్శనలో, బహిరంగ సభలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు కోట మాల్యాద్రి, నగర సహాయ కార్యదర్శి రావుల అంజిబాబు, సీనియర్ నాయకులు నూతలపాటి చిన్న, నగర కమిటీ సభ్యులు మంగ శ్రీనివాసు, దేవానాయక్, జంగాల చైతన్య, విరిగినేని వెంకటేశ్వర్లు, బి. వెంకటేశ్వరరెడ్డి, చల్లా మరియదాసు, లక్ష్మి, విజయ్ కుమార్, మొహమ్మద్ జైద్, ధూపాటి రత్నం, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి శశి, ఏఐవైఎఫ్ నగర అధ్యక్షులు చిన్నపోతుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

హరిత విప్లవ సాధనకు స్వామినాథన్ ఎనలేని కృషి

నగరంపాలెం: హరిత విప్లవ సాధనకు స్వామినాథన్ ఎనలేని కృషి చేశారని వక్తలు కొనియాడారు. స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణం పద్మావతి కల్యాణ వేదికపై గురువారం భారతరత్న ఎంఎస్.స్వామినాథ్ శత జయంతి వేడుకలను గుంటూరు జిల్లా సీనియర్ సిటిజన్స్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆలయ పాలకమండలి నిర్వాహకులు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. సంస్థ అధ్యక్షులు మన్నె సుబ్బారావు ప్రసంగిస్తూ ఎంఎస్.స్వామినాథన్ గ్రీన్ రివల్యూషన్ ప్రణాళికలు, కృషి క్షేత్రం ఆధునికీకరణలో పెద్ద పాత్ర పోషించారని తెలిపారు. హరిత విప్లవ సాధనకు ఎనలేని కృషి చేశారని వివరించారు. అనంతరం పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా స్వామినాథన్ జీవిత విశేషాలను ప్రదర్శించారు.

మాయాబజార్ రోడ్డుకు మోక్షం



మాయబజార్‌లో అసంపూర్తిగా నిలిచిపోయిన రోడ్డును పరిశీలిస్తున్న నూరి ఫాతిమా (ఫైల్)



ప్రశ్నించిన రెండు రోజులకే వేసిన రోడ్డు

- నాలుగు నెలల కిందట నగం రోడ్డు వేసి వదిలేసిన అధికారులు
- వ్యాపారులకు, రోజువారీ వేతన జీవులకు అవస్థలు
- సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లిన వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షురాలు నూరి ఫాతిమా
- పోరాటానికి దిగుతామని హెచ్చరిక
- దిగొచ్చిన అధికారులు
- రెండు రోజుల్లో రోడ్డు పూర్తి

నెహ్రూనగర్: తూర్పు నియోజకవర్గ పరిధిలోని 7వ డివిజన్ మాయాబజార్‌లో ఆగిన రోడ్డు నిర్మాణానికి మోక్షం లభించింది. నాలుగు నెలల కిందట రూ.49లక్షలుతో రోడ్డు, డ్రెయిన్ నిర్మాణ పనులను ఇంజినీరింగ్ అధికారులు చేపట్టారు. అయితే సగం వరకు పనులు చేసి, తరువాత వదిలేశారు. పైగా రోడ్డు మీద రాకపోకలు రాకుండా అడ్డుగా కర్రలు, ద్విచక్ర వాహనాలు పెట్టారు. దీంతో అక్కడ చిరు వ్యాపారులు, రోజు వారీ వేతన జీవులు పూట గడవక ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. స్థానిక నేతలకు మొర వినిపించినప్పటికీ స్పందించకపోవడంతో సమస్యను వ్యాపారులు వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షురాలు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా దృష్టికి తీసుకువెళ్లారు. నాలుగు నెలలుగా పనులు లేకపోవడంతో కుటుంబ పోషణ నిమిత్తం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. స్పందించిన నూరి ఫాతిమా గత శుక్రవారం సాయంత్రం మాయబజార్‌లో పర్యటించారు. సగం వేసిన రోడ్డుపై వ్యాపారులు పడుతున్న బాధలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు.

పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు

పీజీఆర్ఎస్‌లో సోమవారం అదనపు కమిషనర్‌ను నూరి ఫాతిమా కలిసి, మాయబజార్ రోడ్డు వేసి అక్కడ వ్యాపారుల సమస్య తీర్చాలని కోరారు. లేనిపక్షంలో రోడ్డు వేసే వరకు అక్కడే బైఠాయించి నిరసన తెలుపుతామని స్పష్టం చేశారు. దీంతో నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులు దిగొచ్చారు. రెండు రోజుల్లో సిమెంటు రోడ్డు వేసి వాటర్ క్యూరింగ్ చేసేందుకు రోడ్డుపై కట్టలు కట్టారు. దీనిపై స్థానిక వ్యాపారస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత నాలుగు నెలల నుంచి అసంపూర్తిగా ఉన్న రోడ్డు వేయాలని కోరుతున్నప్పటికీ పట్టించుకోని అధికారులు ఇప్పుడు నూరిఫాతిమా జోక్యం చేసుకోగానే హడావుడిగా వేశారని పేర్కొంటున్నారు. సమస్య పరిష్కారానికి కృషి చేసిన నూరి ఫాతిమాకు కృతజ్ఞతలు తెలిపారు.

గ్రీన్ గుంటూరు సాధనే ధ్యేయం

కమిషనర్ పులి శ్రీనివాసులు



అసోసియేషన్ నాయకులతో మాట్లాడుతున్న కమిషనర్

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ చేపట్టిన మిషన్ గ్రీన్ గుంటూరులో భాగంగా ప్రతి ఇంటిలో, అపార్టమెంట్స్‌లో హోమ్ కంపోస్ట్, క్లస్టర్ కంపోస్ట్ తయారీ ప్రోత్సహిస్తామని, అందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు కోరారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని తన చాంబర్‌లో గురువారం కమిషనర్ అపార్ట్‌మెంట్ అసోసియేషన్ల ప్రతినిధులతో మిషన్ గ్రీన్ గుంటూరుపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పర్యావరణ హిత గుంటూరే లక్ష్యంగా నగరపాలక సంస్థ ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు.ఇందులో భాగంగా ఈ సీజన్‌లో దశలవారీగా 5 లక్షల మొక్కలను నాటడం ద్వారా పచ్చదనం పెంచనున్నట్లు తెలిపారు.పారిశుద్ధ్య పనుల్లో మెరుగుదల, వ్యర్థాలను తడిపొడిగా వేరు చేసి తీసుకోవడం, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం, విక్రయం నిషేధం, నగరంలోకి వచ్చే ప్రధాన మార్గాలు, జంక్షన్లు, ఐలాండ్స్, పార్కులు, డివైడర్లపై పచ్చదనం పెంపు వంటి చర్యలు పటిష్టంగా తీసుకోనున్నట్లు తెలిపారు. గత ఏడాదిలో పారిశుద్ధ్య మెరుగుదలకు తీసుకున్న చర్యలు, ప్రజలు సహకరించిన నేపథ్యంలో గుంటూరు నగరపాలక సంస్థ జాతీయ స్థాయిలో స్వచ్ఛ సూపర్ లీగ్ నగరాల సరసన నిలిచిందని పేర్కొన్నారు. అపార్ట్‌మెంట్స్‌లో ప్రధానంగా హోం, క్లస్టర్ కంపోస్ట్ తయారీ, మొక్కల పెంపకానికి ముందుకు రావాలని, అందుకు ఐటీసీ సహకారంతో అవగాహన కల్పిస్తామని చెప్పారు. కంపోస్ట్ తయారీ చేసే వారికి ఆస్తి పన్నులో రాయితీని అందించడానికి ప్రభుత్వంలో ప్రతిపాదన ఉందని వెల్లడించారు. నగరంలో కంపోస్ట్ తయారీ చేసే విధానాన్ని అపార్ట్‌మెంట్స్, ఇళ్ల వారీగా థర్డ్ పార్టీల ద్వారా ఆడిట్ చేసి, బాగా చేసే వారికి ప్రోత్సాహకాలు అందిస్తామని చెప్పారు. కంపోస్ట్ తయారీపై త్వరలో వర్క్ షాప్ నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పర్యావరణ విద్య నోడల్ అధికారి తిరుపతిరెడ్డి, జీఎంజీ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంటు కన్సల్టెంట్ అనిల్ కుమార్, అపార్ట్‌మెంట్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

నెహ్రూనగర్: దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని నవ్యాంధ్ర వికలాంగుల హక్కుల సేవా సమితి రాష్ట్ర అధ్యక్షులు షేక్ కాలేషా విన్నవించారు. ఈ మేరకు గురువారం దివ్యాంగుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ దుర్గాబాయిని ఆ శాఖ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. స్వాతంత్ర్య దినోత్సవంలో అర్హులైన దివ్యాంగులకు ఉపకరణాలు అందజేయాలని విన్నవించారు. దివ్యాంగుల హక్కుల చట్టం- 2016 కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. దివ్యాంగుల బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి చొరవ చూపాలని విన్నవించారు. కార్యక్రమంలో దూపాటి రమణయ్య, బత్తుల సాయికుమార్ పాల్గొన్నారు.

ఎమినిటీ సెక్రటరీలకు అదనపు భారం

సచివాలయాలకు ఇన్‌చార్జ్‌లుగా నియామకం

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ విభాగం అధికారులు ఎమినిటీ సెక్రటరీలను ముప్పుతిప్పలు పెడుతున్నారు. ప్రస్తుతం నగరంలో 207 వార్డు సచివాలయాలు ఉండగా, వీటిలో 105 మంది మాత్రమే సెక్రటరీలు పని చేస్తున్నారు. మిగిలిన వారంతా వివిధ శాఖల్లో డెప్యూటేషన్ మీద బదిలీపై వెళ్లారు. మిగిలిన 102 వార్డు సచివాలయాలకు ప్రస్తుతం నగరపాలక సంస్థ పరిధిలో పనిచేస్తున్న వర్క్ ఇన్‌స్పెక్టర్లకు ఇన్‌చార్జ్ వార్డ్ ఎమినిటీ సెక్రటరీలుగా పోస్టింగ్ కల్పిస్తూ గత నెలలో ఉత్తర్వులు జారీ చేశారు. తాజాగా వారిని తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఉన్న ఎమినిటీ సెక్రటరీలనే ఖాళీగా ఉన్న వార్డు సచివాలయాలకు ఇన్‌చార్జ్‌లుగా నియమిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఒక్కో సెక్రటరీకి నాలుగు నుంచి ఆరు సచివాలయాల విధులు నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. ఒక పక్క రెగ్యులర్ విధులతో పాటు సర్వేలతో సతమతమవుతున్న సెక్రటరీలకు అదనంగా సచివాలయాలకు ఇన్‌చార్జ్‌లు కేటాయించడంతో లబోదిబోమంటున్నారు.

10న ఎస్‌హెచ్‌ఓలో ఉచిత వైద్య శిబిరం

గుంటూరు మెడికల్: సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ (ఎస్‌హెచ్‌ఓ) హైపర్ టెన్షన్ అండ్ డయాబెటిక్ క్లబ్, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో వచ్చే నెల 10న (ఆదివారం) న్యూరాలజీ ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థల అధ్యక్షులు డాక్టర్ టి .సేవకుమార్, పావులూరి రమేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు 2/1 బ్రాడీపేటలోని ఎస్‌హెచ్‌ఓ భవనంలో నిర్వహించే ఈ వైద్య శిబిరంలో ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ పి.నటరాజ పాల్గొంటారని పేర్కొన్నారు. తలనొప్పి, పార్శ్వపు నొప్పి (మైగ్రేన్), పక్షవాతం, మూర్ఛ వ్యాధి (ఫిట్స్), మతిమరుపు, అల్జీమర్స్, అరికాళ్లలో మంటలు, తిమ్మిర్లు (న్యూరోపతి), పార్కిన్ సోనిజం తదితర మెదడు, నరాల అనారోగ్య సమస్యలు, విటమిన్ డి లోప సమస్యలు, మధుమేహ బాధితుల్లో భుజాల నొప్పులు తదితర అంశాలపై శాస్త్రీయ అవగాహన సభ ఉంటుందని వివరించారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని వారు కోరారు.

అక్రమ కట్టడాలు, హోర్డింగ్స్ కూల్చివేత



అక్రమ నిర్మాణాన్ని కూల్చివేస్తున్న పట్టణ ప్రణాళిక సిబ్బంది

నెహ్రూనగర్: నగరంలో అక్రమ కట్టడాలు, హోర్డింగ్స్ కూల్చివేతను గురువారం నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక విభాగం సిబ్బంది చేపట్టారు. అరండల్ పేట, బ్రాడీపేట, పట్టాభిపురం, శీలంవారి వీధి, భారత్ పేట, ఏటీ అగ్రహారం, లక్ష్మీపురం, పెద్దపలకలూరు, రెడ్డిపాలెం, ఇన్నర్ రింగ్ రోడ్డు, ఉడా రోడ్డు తదితర ప్రాంతాల్లో గురువారం అనధికార నిర్మాణాలు, పార్కింగ్ రూమ్‌లు, ర్యాంప్‌లు, అదనపు ఫ్లోర్‌లు, గదులను కూల్చి వేశారు. 57 హోర్డింగ్స్, బోర్డులను తొలగించారు. అనధికార నిర్మాణాలు, హోర్డింగ్స్ తొలగింపు కొనసాగుతుందని, అవసరమైతే అదనపు జేసీబీలు, సిబ్బందిని సమకూర్చుకోవాలని సిటీ ప్లానర్‌ని ఆదేశించామని కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. ఇప్పటికే వార్డ్ సచివాలయాల వారీగా అనధికార నిర్మాణాలు, హోర్డింగ్స్‌లను గుర్తించామని, వాటన్నింటిని తొలగిస్తామని ఆయన స్పష్టం చేశారు.

మత్తుతో భవిష్యత్ చిత్తు



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ అబ్దుల్ అజీజ్

పట్నంబజారు: విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసలై బంగారు భవిష్యత్తును పాడు చేసుకోవద్దని ఈస్ట్ సబ్ డివిజన్ డీఎస్పీ షేక్ అబ్దుల్ అజీజ్ చెప్పారు. లాలాపేట పోలీసు స్టేషన్ పరిధిలోని పవర్ పేటలో మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్‌లో 'విద్యార్థులు - సెల్‌ఫోన్ ప్రభావం - మత్తు పదార్థాలకు దూరం' అనే అంశంపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ తాను కూడా ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకుని, ఈ స్థాయికి చేరానని తెలిపారు. నేటి విద్యార్థులు చదువుకు దూరమై, అధికంగా సెల్‌ఫోన్‌లతో గడపడం ద్వారా జీవితాలు పాడు చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలని సూచించారు. ఆరోగ్యం విషయంలో అప్రమత్తంగా ఉండాలని, చెడు వ్యసనాలకు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ ప్రవీణ, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పచ్చి అబద్ధాలకోరు చంద్రబాబు

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షురాలు షేక్ నూరిఫాతిమా



స్కానర్లు ఆవిష్కరిస్తున్న నూరిఫాతిమా, నేతలు

పట్నంబజారు: పచ్చి అబద్ధాలకోరు చంద్రబాబు అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షురాలు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా విమర్శించారు. నియోజకవర్గంలోని 12వ డివిజన్‌లో గురువారం 'బాబు ష్యూరిటీ - మోసం గ్యారంటీ' కార్యక్రమం నిర్వహించారు. నూరిఫాతిమాతో పాటు నేతలు ఇంటింటికీ వెళ్లి ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చిన వాగ్దానాలు, అమలు చేయని విధానాలను తెలియజేశారు. ఈ సందర్భంగా నూరి ఫాతిమా మాట్లాడుతూ ప్రజల పక్షాన పోరాటమే తమ అజెండా అని స్పష్టం చేశారు. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా తాము ఎప్పుడూ ప్రజల పక్షమేనని చెప్పారు. కూటమి ఎన్నికల సమయంలో ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేసిన పాపాన పోలేదని మండిపడ్డారు. పైగా తామేదో అన్ని చేశామని గ్లోబల్ ప్రచారం చేయడం సిగ్గుచేటని పేర్కొన్నారు. ప్రజలు రానున్న రోజుల్లో కూటమి సర్కార్‌కు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు, కార్పొరేటర్లు, అనుబంధ విభాగాల నేతలు పాల్గొన్నారు.

బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ ఆత్మహత్య



కామర్తి శ్రీధర్

లక్ష్మీపురం: ఆర్థిక లావాదేవీల కారణంగా బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ ఇన్‌కమ్ ట్యాక్స్ రిక్రియేషన్ సెంటర్‌లో కిటికీకి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం రాత్రి చోటు చేసుకుంది. నగరంపాలెం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కర్నూలు జిల్లాకు చెందిన కామర్తి శ్రీధర్ (35) గుంటూరు నగరంపాలెంలోని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో అసిస్టెంట్ మేనేజర్‌గా పని చేస్తున్నారు. భార్య ఇంద్రజతో కలసి గోరంట్లలో నివాసం ఉంటున్నారు. అయితే శ్రీధర్‌కు అన్నవరానికి చెందిన విజయకుమార్ అనే వ్యక్తి పరిచయం అయ్యాడు. వ్యాపారం చేసి అందులో లాభాలు ఆర్జించవచ్చని నమ్మబలికాడు. దీంతో శ్రీధర్ బ్యాంక్ లోన్ ద్వారా కొంత, భార్య బంగారం తాకట్టు పెట్టి మొత్తం సుమారు రూ.40 లక్షల వరకు పెట్టుబడిగా ఇచ్చాడు. అయితే, డబ్బు తీసుకుని తిరిగి ఇవ్వకపోవడంతో పలుమార్లు శ్రీధర్ కుటుంబ సభ్యులు సైతం అన్నవరం వెళ్లి విజయకుమార్‌ను నిలదీశారు. అదిగో.. ఇదిగో అంటూ కాలయాపన చేస్తున్నాడు. అయితే, ఆర్థిక ఇబ్బందుల కారణంగా శ్రీధర్ గురువారం ఉదయం నగరంపాలెంలోని ఇన్‌కమ్ ట్యాక్స్ భవనం 5వ అంతస్తులో ఉన్న సెంట్రల్ బ్యాంక్‌కు రోజు మాదిరిగానే విధులకు వచ్చాడు. ఉదయం 11 గంటలకు బ్యాంక్‌లో నుంచి బయటకు వెళ్లాడు. రాత్రి అయిన బ్యాంక్‌కు గానీ, ఇంటికి గానీ రాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల పరిశీలించినా ఫలితం లేకపోయింది. సీసీ కెమెరాలను పరిశీలించగా ఇన్‌కమ్ ట్యాక్స్ కార్యాలయంలోని రిక్రియేషన్ గదిలోకి వెళ్లినట్లు గుర్తించారు. అక్కడ కిటికీకి శ్రీధర్ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుని మృతి చెంది ఉన్నాడు. దీంతో నగరంపాలెం పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ నజీర్ బేగ్, ఎస్ఐ ప్రసన్న సిబ్బందితో ఘటనా ప్రదేశానికి చేరుకుని మృతి చెందిన వైనాన్ని పరిశీలించారు. మృతిడి కుటుంబ సభ్యులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పార్టీల సూచనల మేరకే పోలింగ్ కేంద్రాల ఏర్పాటు



రాజకీయ పార్టీ నాయకులతో సమావేశమైన అదనపు కమిషనర్

నెహ్రూనగర్: పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు సూచనలు అమలుకు చర్యలు తీసుకుంటామని పశ్చిమ నియోజకవర్గం ఈఆర్‌ఓ, అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు తెలిపారు. గురువారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని తన చాంబర్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లో 12 వందల మందికి మించిన ఓటర్లు ఉన్న ప్రాంతాల్లో మరొక కేంద్రం ఏర్పాటు చేస్తామన్నారు. ఆయా కేంద్రాల ఏర్పాటుపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల నుంచి సూచనలు తీసుకున్నామని, వాటిని నిబంధనల మేరకు పరిశీలించి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాల పేర్లు, చిరునామాలు మార్పులు ఉంటే వాటిని కూడా తమ దృష్టికి తీసుకురావచ్చని ఆయన తెలిపారు. బీఎల్‌ఓలు కొంత మంది బదిలీ అయ్యారని, వారి స్థానంలో కొత్తగా వచ్చిన సెక్రటరీలను నియమించినట్లు తెలిపారు. సమావేశంలో ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు, సూపరింటెండెంట్ పద్మనాభరావు, వివిధ పార్టీల నాయకులు దాసరి జాన్‌బాబు (వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ) ఎన్.ఓంకార్ (తెలుగుదేశం), సీహెచ్.రామవెంకట త్రినాథ్ (జనసేన), సీహెచ్.వాసు (బీఎస్పీ), బిల్లా సునీల్ కుమార్ (కాంగ్రెస్), తాతాసేవా కుమార్ (ఆమ్ ఆద్మీ) పాల్గొన్నారు.

ముస్లింల మనోభావాలు దెబ్బతినేలా మాధవ్ వ్యాఖ్యలు



మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి గులాం రసూల్

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి షేక్ గులాం రసూల్

పట్నంబజారు: ముస్లింల మనోభావాలు దెబ్బతినే విధంగా బీజేపీ నేతలు వ్యవహరించటం సిగ్గుచేటని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి షేక్ గులాం రసూల్ మండిపడ్డారు. బృందావన్ గార్డెన్స్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రెండు రోజుల కిందట బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు మాధవ్ గుంటూరు వేదికగా ముస్లింల మనోభావాలను దెబ్బతీసే విధంగా వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం సబబు కాదని తెలిపారు. గుంటూరులోని జిన్నా టవర్ పేరు మారుస్తా అంటూ చేసిన వ్యాఖ్యలు ఎంతో బాధాకరమని పేర్కొన్నారు. మాధవ్ ముందు జిన్నా చరిత్ర తెలుసుకొని మాట్లాడితే బాగుంటుందని సూచించారు. కులాలు, మతాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని అక్రమ కేసుల్లో జైలు శిక్ష అనుభవిస్తున్న వారిని జిన్నా బయటకు తీసుకువచ్చారని తెలిపారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అన్ని మతాల పెద్దలను పిలిచి, ఎటువంటి వివాదాలకు తావు లేకుండా జిన్నా టవర్ వద్ద జాతీయ చిహ్నాన్ని ఎగర వేసినట్లు పేర్కొన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు మాధవ్ వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని, లేదంటే గుంటూరు మిర్చి ఘాటు చూపించాల్సి వస్తుందని తెలిపారు. బీసీ కులానికి చెందిన ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌పై దాడులు జరిగితే ఆ విషయాన్ని పట్టించుకోలేదని, కనీసం ఖండించిన పాపాన పోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసలు గాడ్సేని ప్రేమించేది బీజేపీనేనని తెలిపారు. ఈ దేశం కోసం ప్రాణాలు అర్పించిన వారిలో 70 శాతం ముస్లింలు ఉన్నారని చెప్పారు. దేశంతో పాటు గుంటూరు జిల్లాలో అనేక బ్రిటిష్ కట్టడాలు ఉన్నాయని, వాటిని కూడా కూలుస్తారా ? పేర్లు మారుస్తారా ? అనే విషయంపై బీజేపీ నేతలు సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. వైఎస్సార్ సీపీ మైనారిటీ జిల్లా అధ్యక్షుడు పఠాన్ సైదాఖాన్, కార్పొరేటర్లు ఆబీద్ బాషా, మెహమూద్, పార్టీ నేతలు అఫ్సర్, లియాఖత్‌అలీ, ఫిర్దోస్, అహ్మద్ పాల్గొన్నారు.

అన్ని భాషలకు తల్లి సంస్కృతం



సంస్కృత భాషా దినోత్సవంలో పవన్‌కుమార్, అనితాదేవి, కామేశ్వరశాస్త్రి, అధ్యాపకులు

గుంటూరు ఎడ్యుకేషన్: సంస్కృతం అన్ని భాషలకు తల్లి వంటిదని ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయ సంస్కృత భాషాధిపతి డాక్టర్ చందూరి పవన్‌కుమార్ అన్నారు. పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాలలో గురువారం సంస్కృత విభాగ ఆధ్వర్యంలో సంస్కృత భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ముఖ్య వక్తగా పాల్గొన్న డాక్టర్ పవన్‌కుమార్ మాట్లాడుతూ ప్రపంచ దేశాలన్నీ సంస్కృత విజ్ఞానాన్ని పొందడానికి, భాషను అభ్యసిస్తూ, వాటిపై పరిశోధనలు చేస్తున్నాయని తెలిపారు. రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో అణుబాంబును తయారుచేసిన అమెరికన్ శాస్త్రవేత్త జె.రాబర్ట్ ఓపెన్ హైమర్ సంస్కృతంలో ఉన్న భగవద్గీతను చదివి స్థిమితపడ్డాడని గుర్తు చేశారు. భావవ్యక్తీకరణకు భాష ముఖ్యమని, కవి సార్వభౌముడైన శ్రీనాథుడు జనని సంస్కృతంబు సకల భాషలకు అని కీర్తించి భాష గొప్పతనాన్ని చాటారని కొనియాడారు. ఆది కావ్యమైన రామాయణం జీవన విధానాన్ని నేర్పుతుందని, మహాభారతం సమస్త విజ్ఞానాన్ని అందిస్తుందని తెలిపారు. జర్మన్ దేశస్థుడైన మాక్స్ ముల్లర్ మనదేశ జ్ఞానభాండాగారమైన వేదాలను తమ దేశానికి తీసుకు వెళ్లాడని చెప్పారు. జర్మనీలో అథర్వణ వేదంపై పరిశోధనలు చేస్తూ అగ్రస్థానంలో ప్రయాణిస్తున్నారని, అక్కడ తప్పనిసరిగా సంస్కృతాన్ని అభ్యసిస్తున్నారని పేర్కొన్నారు. ఆ జ్ఞానాన్ని మనం అందుకోలేక పోతున్నామంటే, అది మనతప్పేనని పేర్కొన్నారు. కళాశాల కరస్పాండెంట్ కేవీ బ్రహ్మం మాట్లాడుతూ సంస్కృతానికి వ్యాకరణం, సాహిత్యం పటిష్టంగా ఉన్నాయని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు సంస్కృత సినీగీతాలను ఆలపించారు. సంస్కృతంలో లఘు నాటికను ప్రదర్శించడంతో పాటు కథలు విన్పించారు. కార్యక్రమంలో డిగ్రీ, పీజీ కళాశాలల ప్రిన్సిపాల్స్ బి.వి.హెచ్.కామేశ్వరశాస్త్రి, ఎస్.అనితాదేవి, వైస్ ప్రిన్సిపాల్ ఏ.భానుమురళీధర్, సంస్కృత విభాగాధిపతి పి.దేవేంద్రగుప్త ,అధ్యాపకులు ఏ.అంజనీకుమార్, ఆర్.జయశైలజ, యస్.త్రివేణి, జి.సురేష్ కుమార్, లైబ్రేరియన్ బి.సాయికళ పాల్గొన్నారు.

ఘనంగా పానుగంటి జన్మదిన వేడుకలు



పట్నంబజారు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. పార్టీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు వినోద్, రవీంద్ర ఆధ్వర్యంలో గురువారం బ్రాడీపేటలోని శ్రీసాయి దీన జన సేవా సమితి ఆధ్వర్యంలో పుట్టిన రోజు కేక్‌ను కట్ చేశారు. అనంతరం అక్కడి విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ బందా రవీంద్రనాథ్, కార్పొరేటర్లు ఈచంపాటి వెంకటకృష్ణ, రోషన్, వెలుగూరి రత్నప్రసాద్, ఓర్సు శ్రీనివాసరావు, సత్యవతి, శంకర్, విద్యార్థి విభాగం నేతలు పాల్గొన్నారు.